క్లుప్తంగా

పుస్తకావిష్కరణ రేపు

రాజాం: పట్టణంలోని సూర్యదుర్గా కల్యాణ మండపంలో పొనుగుటివలసకు చెందిన శాసపు రామినాయుడు(వెలుగు రామినాయుడు) రాసిన పొలమారిన ఊరు అనే కవితాసంపుటి పుస్తకాన్ని ఈ నెల 29వ తేదీన ఆవిష్కరించనున్నారు. సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజాం రోటరీ సంస్థ సభ్యుడు మక్క అప్పలనాయుడు విచ్చేసి, పుస్తకాన్ని విడుదల చేయనున్నారన్నారని రాజాం వెలుగు సంస్థ సభ్యులు పేర్కొన్నారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలంతా హాజరుకావాలని కోరారు.

నేడు 'విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక'

రామభద్రపురం: బొబ్బిలి విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఈ శశిభూషణరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. రామభద్రపురం, తెర్లాం, బాడంగి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులంతా హాజరై, తమ సమస్యలు తెలియజేయాలని కోరారు.

ఇసుక లారీ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక లారీ

సంతకవిటి: మండల పరిధిలోని పోతులజగ్గపేట వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఏఎస్ఐ వాసుదేవరావు మంగళవారం వెల్లడించారు. పోడలి వద్ద ఉన్న నాగావళి నదీతీరం నుంచి ఇసుకను లోడ్ చేసుకుని వస్తుండగా, పట్టుకుని, విశాఖపట్నం జిల్లాలోని పద్మనాభపురానికి చెందిన లారీ డ్రైవరు కోరాడ శ్రీనువాసరావు, లారీ ఓనరు పూసర్ల రమణలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ షేక్ శంకర్

వంగర: మండలంలోని మద్దువలస జంక్షన్ వద్ద ఎస్ఐ షేక్ శంకర్ తన సిబ్బందితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు లేని వారిని పట్టుకుని, అపరాధ రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వాహనంతో బయటకు వచ్చేటప్పుడు లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలన్నీ వెంట తీసుకురావాలని వాహనదారులకు సూచించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, మద్యంతాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని తెలిపారు.

వితరణ



విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేస్తున్న నాగేంద్రబాబు

రామభద్రపురం: మండలంలోని ఇట్లామామిడిపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన వారణాసి నాగేంద్రబాబు విద్యాసామగ్రి వితరణ చేశారు. ఆయన తన కూతురు హార్దికరామ పుట్టినరోజు సందర్భంగా రూ.20 వేలతో సమకూర్చిన పెన్నులు, నోటుపుస్తకాలు, పాఠశాలకు అవసరమైన మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయుడు తెంటు సత్యనారాయణకు మంగళవారం అందజేశారు. ఇదే పాఠశాలలో చదువుకున్న తాను ఇదే పాఠశాలలో చదివే విద్యార్థులకు తనవంతు సాయం చేయడం చాలా ఆనందంగా ఉందని నాగేంద్రబాబు అన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న చెస్ అసోసియేషన్ సభ్యులు

బొబ్బిలి: రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు స్థానిక పట్టణానికి చెందిన విద్యార్థి రాంబార్కి హేమ నాగహర్షిత్ ఎంపికైనట్లు చెస్ అసోసియేషన్ విజయనగరం జిల్లా సంయుక్త కార్యదర్శి మూడడ్ల గణేష్‌నాయుడు తెలిపారు. ఇటీవల విజయనగరం జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సదరు విద్యార్థి విశేష ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. సెప్టెంబరు 21, 22వ తేదీల్లో జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

- ఎరువుల కొరతపై సభ్యుల మండిపాటు
- ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రికల్ బిల్లుల వసూళ్లపై నిలదీత
- తోటపల్లి కాలువల ద్వారా నీరేదంటూ ప్రశ్నలు
- సమన్వయంతో వ్యవహరించాలని ఎమ్మెల్సీ విక్రాంత్ సూచన



ఎరువుల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సాధారణ సమావేశం వాడీవేడిగా కొనసాగింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తోందని, సంక్షేమం ఏది అని వైఎస్సార్ సీపీ మద్దతుదారులైన ఎంపీటీసీ సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం వచ్చి రెండున్నర నెలలే అయిందని, అప్పుడే తొందరెందుకు అని టీడీపీ మద్దతుదారులైన సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని వెనకేసుకువచ్చారు. ఇదే సమయంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కలుగజేసుకుని, సభ సజావుగా జరగాలని కోరడంతో వైఎస్సార్ సీపీ సభ్యులు వెనక్కి తగ్గగా, పలు శాఖల పనితీరుపై చర్చ ఆరంభమైంది. తొలుత వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో మండల వ్యవసాయాధికారి రేణుకాసాయి మాట్లాడుతూ మండలంలోని రైతులందరికీ ఎరువులు అందించామని తెలుపగా, అదే సమయంలో అంతకాపల్లి సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల అనంతరం రాజాం మండలానికి ఒక్క ఎరువు బస్తా కూడా ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. నందబలగ పంచాయతీ పరిధిలోని రైతులకు కూడా ఒక్క ఎరువు బస్తా ఈ ప్రభుత్వ హయాంలో అందలేదని సర్పంచ్ ఈశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, ఈ క్రాప్ నమోదు సైతం మందకొడిగా జరుగుతోందని పలువురు సభ్యులు అన్నారు. పౌర సరఫరాల శాఖకు సంబంధించి జరిగిన చర్చలో తహసీల్దార్ ఎస్‌కే రాజు.. మండలంలో ప్రజా పంపిణీ వ్యవస్థ వివరాలను వెల్లడించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి, రైతు వారీ పనులపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన ఉండాలని, ప్రజాప్రతినిధులు గ్రామసభల్లో తమకు సహకరించాలని ఏపీవో సాయిరాం కోరారు.

● కొత్త ఇళ్ల మంజూరు లేదు..

గృహ నిర్మాణ శాఖ సమీక్షలో ఏఈ వేణుగోపాలరావు మాట్లాడుతూ కొత్త ఇళ్లు మంజూరు ప్రస్తుతం లేదని, గతంలోని నాన్‌స్టార్ట్ ఇళ్లు ప్రస్తుతం ప్రారంభించేందుకు అవకాశం ఉందన్నారు. గతంలో ఇల్లు మంజూరు చేయబడి, పనులు ప్రారంభించని లబ్ధిదారులు పనులు ప్రారంభించుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ సమీక్షలో రూరల్ ఎలక్ట్రికల్ ఏఈ సురేష్ మాట్లాడుతుండగా అంతకాపల్లి సర్పంచ్ చిన్నంనాయుడు అడ్డుతగిలారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఉండేదని, ఇప్పుడు బిల్లులు కట్టించుకుంటున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై గ్రామంలో ప్రజావేదిక నిర్వహించాలని కోరారు. వెలుగు పథకంపై ఏపీఎం అప్పలనాయుడు మాట్లాడుతూ 35 శాతం రాయితీపై ఇస్తున్న పీఎంఈజీపీ రుణాలు వినియోగించుకోవాలని కోరారు. ఈ పథకాలకు సంబంధించి, అర్హుల సంఖ్యను పరిమితం చేయకుండా లబ్ధిదారులందరి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని ఎమ్మెల్సీ విక్రాంత్ సూచించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ పథకంపై జరిగిన సమీక్షలో బాలసంజీవిని పథకం గురించి, సూపర్‌వైజర్ సన్యాసమ్మ వివరించారు. తోటపల్లి ప్రాజెక్టు పిల్లకాలువల నీటి సరఫరాపై ఏఈ రమణ మాట్లాడుతుండగా పలువురు సభ్యులు మండిపడ్డారు. కాలువ ప్రారంభం నుంచి రాజాం మండలంలో ఏ గ్రామానికీ సాగునీటి సరఫరా లేదని, కనీసం కాలువ పక్కనే ఉన్న ఆయకట్టుకు కూడా నీరు సరఫరా కావడం లేదని ఆరోపించారు. ఎప్పుడూ పనులు చేస్తున్నామని చెప్పడమే తప్ప అసలు పని ఏదని ధ్వజమెత్తారు.

పార్టీలకతీతంగా పథకాలు ఇవ్వాలి..

అనంతరం గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఎంపీడీవో వి.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. చివరిగా సమావేశాన్ని ఉద్దేశించి, ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వ హయాంలో కూడా అర్హులందరికీ పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు అందించేందుకు టీడీపీ నేతలు సహకరించాలని కోరారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గెలుపును అభినందిస్తున్నామని, రాజాంలోని రోడ్డు సమస్యలను పరిష్కరించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, తహసీల్దార్ ఎస్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక పోలీస్‌స్టేషన్ రోడ్డు పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ సంబరాలు నిర్వహించనున్నామని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శాసపు సత్యనారాయణ తెలిపారు. సంబరాల్లో భాగంగా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సృజనాత్మకత పరీక్ష ఉంటుందన్నారు. సెప్టెంబరు 25వ తేదీన పాఠశాల స్థాయిలో, అక్టోబరు 1న మండల స్థాయిలో, 27న జిల్లా స్థాయిలో, నవంబరు 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో జేవీవీ గౌరవాధ్యక్షుడు జె.నీలయ్య, కొత్తా సాయిప్రశాంత్ కుమార్, మక్క అప్పలనాయుడు, పండూరు వేణుగోపాల్, ఎ.వెంకటినాయుడు, యూఎస్ యాదవ్, పెంకి చైతన్య, పక్కి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చెందవద్దు



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ చంద్రరావు

రేగిడి: కౌలుకు భూములు చేస్తున్న రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని రాజాం వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు అన్నారు. మండలంలోని బూరాడ, లింగాలవలస, తోకలవలస తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో కౌలురైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కౌలురైతులకు ప్రభుత్వం రాయితీపై ఎరువులు, పురుగుమందులు అందజేస్తోందన్నారు. కౌలురైతులకు ఇచ్చే హక్కుపత్రాలు తాత్కాలికమేనని, వీటిపై కొంతమంది రైతులకు అనుమానాలు ఉన్నాయని, వాటిపై ఎటువంటి అపోహలు వద్దన్నారు. మండలంలో 139 మంది కౌలురైతులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఏవో జి.మురళీకృష్ణ, వీఏఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోండి



ఆయుర్వేద మందులు వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి

రామభద్రపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి సూచించారు. మండలంలోని బూసాయవలస గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో మంగళవారం సమావేశమైన ఆమె.. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. కేంద్రాల ద్వారా ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. పోర్టిఫైడ్ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత తగ్గి, ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.

లంపీస్కిన్ వ్యాధి బారిన పశువులు



లంపీస్కిన్ వ్యాధి సోకిన లేగదూడ

వంగర: మండలంలోని ఇరువాడ పంచాయతీ, చంద్రంపేట గ్రామంలోని పశువులు లంపీస్కిన్ వ్యాధి బారిన పడుతున్నాయి. గత 10 రోజులుగా పశువులకు ఈ వ్యాధి ఎక్కువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన తెర్లి జగ్గునాయుడు, అయ్యల స్వామియాజులు, లక్ష్మీనరసింహమూర్తి, పెద్దింటి వెంకటనాయుడు, వంగపండు వెంకటనాయుడు, నాగళ్ల లక్షుంతో పాటు మరి కొంతమంది రైతులకు చెందిన పశువులు ఈ వ్యాధితో ప్రస్తుతం బాధపడుతున్నాయి. పశువుల శరీరంపై చిన్నపాటి పొక్కులు ఏర్పడి, అవి తర్వాత పుండ్లుగా మారుతున్నాయని సంబంధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పశు వైద్యసేవలు అంతగా అందడం లేదని, అధికారులు స్పందించి పశువైద్య సేవలందించాలని కోరుతున్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

రేగిడి: సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు పండిస్తే అధిక దిగుబడులు వస్తాయని సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ కేస్ రమేష్ అన్నారు. మండలంలోని గుల్లపాడు గ్రామంలో జీవామృతం తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్2 గౌరీశ్వరరావు తొలుత జీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, దాని ప్రయోజనాలు తెలిపారు. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వినియోగిస్తే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ చెరకు పంట సాగులో కూడా సేంద్రియ ఎరువులు వినియోగిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో చక్కెర కర్మాగారం ఫీల్డ్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, ఎల్2 సురేష్, ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, గోవిందమ్మ, శ్రీలత, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారావుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న కృష్ణారావు

రాజాం సిటీ: వైద్యారోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న రాజాం ప్రాంతానికి చెందిన చౌదరి కృష్ణారావుకు నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వైద్యం, వైద్య ఆధారిత వృత్తుల వారి స్వీయ కార్యదక్షతపై మానసిక ఆరోగ్య ప్రభావం అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు గాను వర్సిటీ సైకాలజీ విభాగం డాక్టరేట్ ఇచ్చినట్లు ఆయన మంగళవారం తెలిపారు. కృష్ణారావుకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు.

విద్యుత్ కార్మిక సంఘ సమావేశం

బొబ్బిలి: స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం బొబ్బిలి, పార్వతీపురం బ్రాంచ్‌ల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. బొబ్బిలి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఆదిలక్ష్మి, యు.శ్రీనివాసరావు, పార్వతీపురం అధ్యక్ష, కార్యదర్శులు పి.భాస్కరరావు, కె.రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రీజనల్ అధ్యక్షుడు బి.తేజేశ్వరరావు, సెక్రటరీ కె.జయరాజు, సభ్యులు పాల్గొని, సంఘ సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. బదిలీల్లో ఏ ఒక్క కార్మికుడికీ అన్యాయం జరగనీయకుండా సంఘ కార్యవర్గం పనిచేస్తుందన్నారు.

సంక్షిప్తంగా...

పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహించండి

రేగిడి: పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని, ఆ దిశగా రైతులను చైతన్యం చేయాలని ఏపీవో ఎస్.హరనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశమైన ఆయన.. ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న జీడి, మామిడి, సపోటా, కొబ్బరి మొక్కల గురించి రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ ఎం.రామినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

రాజాం: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద రాజాం వాసవీ క్లబ్ వనితా శక్తి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులంతా శ్రీకృష్ణ పరమాత్ముడికి విశేష పూజలు చేశారు. అనంతరం ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ వనితాశక్తి ప్రెసిడెంట్ పొట్టా శ్రీదేవి, కార్యదర్శి బండి అరుణకుమారి పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని తమ్మయ్యవలస ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులు, విద్యార్థుల హోమ్‌వర్క్ పుస్తకాలు, చేతిరాత పుస్తకాలు, అభ్యసన సామర్థ్యాలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం పరిశీలించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

దోమల నివారణకు చర్యలు


తెర్లాం: మండలంలోని రంగప్పవలస పంచాయతీ పరిధిలోని తమ్మయ్యవలస గ్రామంలో సర్పంచ్ శనపతి రాంబాబు ఆధ్వర్యంలో దోమల నివారణకు అవసరమైన చర్యలు మంగళవారం చేపట్టారు. ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, ఈవోపీఆర్డీ నీలిమ ఆదేశాల మేరకు గ్రామంలోని అన్ని వీధుల్లో దోమలు వ్యాప్తి చెందకుండా దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. సర్పంచ్ మాట్లాడుతూ దోమలు పెరగకుండా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

మట్టి ప్రతిమలనే పూజిద్దాం

రాజాం సిటీ: మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దామని పిలుపునిస్తూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రానున్న వినాయక చవితి పండగలో ప్రతిఒక్కరూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలనే వాడాలని కోరారు. పర్యావరణం కాలుష్యం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.హరిబాబు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ మంగళవారం చేపట్టారు. వనమిత్ర కృష్ణదాస్, తదితరులు ఇంటింటికీ వెళ్లి, మట్టి ప్రతిమలను అందజేసి, రానున్న వినాయక చవితి పండగ నాడు వాటిని పూజించాలని కోరారు.

పంపిణీకి సిద్ధం



పంపిణీకి సిద్ధం చేసిన మట్టి వినాయక ప్రతిమలు

రాజాం: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా స్థానిక పట్టణంలోని భక్తులకు పంపిణీ చేసేందుకు 1001 మట్టి వినాయకుల విగ్రహాలను సిద్ధం చేశామని రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు తెలిపారు. ఇదే విషయమై రాజాం గ్రీన్‌బెల్ట్ కో–ఆర్డినేటర్ ఆర్‌వీజే నాయుడు విలేకరులతో మంగళవారం మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వాడాలన్న సదుద్దేశ్యంతో రాజాం పట్టణానికి చెందిన సిటీ సూపర్ మార్కెట్ యాజమాన్యం వీటిని భక్తులకు ఉచితంగా అందజేస్తోందన్నారు. వినాయక చవితి పండగలో ప్రతిఒక్కరూ మట్టి ప్రతిమలనే వాడి పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలని కోరారు.

సమస్యలపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తాం..



తెర్లాం: తమ్మయ్యవలసలో పీఎం జన్‌మన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ



బొబ్బిలి రూరల్: గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

- పీఎం జన్‌మన్ కార్యక్రమంలో ఎంపీడీవో శంబంగి రామకృష్ణ

తెర్లాం: ఆదివాసీ కాలనీల్లోని తాగునీరు, రోడ్డు సమస్యల పరిష్కారంపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ తెలిపారు. మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో పీఎం జన్‌మన్(ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రామంలోని ఆదివాసీ కుటుంబాలు, వారి జీవన స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీఎం జన్‌ధన్ ఖాతాలు అందరికీ ఉన్నాయా, లేదా అని ప్రశ్నించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి, కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. ప్రతి ఒక్కరితో జన్‌ధన్ ఖాతాలు తెరిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో మంగళవారం నుంచి సెప్టెంబరు 10వ తేదీ వరకు ప్రతిరోజూ రోజుకు ఒక శాఖ తరపున అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామంలోని ఆదివాసీ కుటుంబాల వారంతా ప్రతీ పథకంపైనా, శాఖపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, పంచాయతీ ఈవో సూరిబాబు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

బొబ్బిలి రూరల్: పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిబ్బగుడ్డివలస పంచాయతీలోని రాచేరువలస గ్రామంలో అధికారులు మంగళవారం పర్యటించి, గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులంతా అధికారులను కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అభ్యర్థించారు. సీసీ రోడ్లు వేయాలని, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, వైద్య సదుపాయం అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. తహసీల్దారు శ్రీను, ఎంపీడీవో రవికుమార్‌లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికే తాము వచ్చామని, ప్రజా సమస్యల పరిష్కారంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల రామారావు, పంచాయతీ కార్యదర్శి ఉడముల వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



బాలికలను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: మహిళలు, బాలికలపై ఎక్కడపడితే అక్కడ లైంగికదాడులు జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు బాలికలపై లైంగికదాడులు–నివారణ అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఎక్కడైనా ఇబ్బందికి గురిచేస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 100కు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని, వెంటనే పోలీసులు వచ్చి రక్షణ కల్పిస్తారన్నారు. అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగాడినా, ప్రవర్తించినా జాగ్రత్తపడి అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలన్నారు. అనంతరం ఆత్మరక్షణకు ఉపయోగపడే పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు వండి పెట్టాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని వండానపేట, చాటాయవలస, ఉప్పరనాయుడువలస తదితర గ్రామాల్లోని పాఠశాలలను మంగళవారం సందర్శించిన ఆయన అక్కడి పాఠశాలల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. వేడివేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలను విద్యార్థులకు వడ్డించాలని, కాచివడపోసిన నీటినే తాగేందుకు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వంగర: విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని ఎంఈవో వై.దుర్గారావు సూచించారు. మండలంలోని నీలయ్యవలస గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన.. రికార్డుల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్ జయరాజ్, లెంక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్ రాథో, తదితరులు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామానికి చెందిన సత్యసాయి సేవా సంస్థల రాజాం జోనల్ కన్వీనర్ కరణం రామకృష్ణ, ఆయన తనయుడు కిరణ్‌కుమార్‌లు ఇటీవల శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం దగ్గరున్న జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న సత్యసాయి సేవా సంస్థల విజయనగరం జిల్లా అధ్యక్షుడు వి.వి.ఎస్.ఎస్.సునీల్‌కుమార్ రాథో, రాష్ట్ర గ్రామ సేవా ఇన్‌చార్జ్ ఎం.ఎస్ సత్యనారాయణలు మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రామకృష్ణ గొప్పతనం వివరించారు. నిస్వార్థ సేవకుడైన రామకృష్ణను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు, ఆయన కుమారుడి ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఐటీ కో–ఆర్డినేటర్ హైమావతి, వెంకటేష్ మాస్టారు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.